క్లుప్తంగా

నేడు మండల సమావేశం

తాళ్లూరు: మండల సర్వసభ్య సమావేశం బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీఓ ఎస్ సత్యం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగే సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, మండలస్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

రైతులు నల్లబర్లీ పొగాకు సాగు చేయరాదు


రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి

దొనకొండ: రైతులు నల్లబర్లీ పొగాకు సాగు చేసి నష్టపోవద్దని వ్యవసాయాధికారి వి.బాలకృష్ణనాయక్ అన్నారు. మండలంలోని రుద్రసముద్రం, మల్లంపేట గ్రామాల్లోని రైతులతో మంగళవారం మాట్లాడారు. రైతులు నల్లబర్లీ పొగాకు సాగు చేయకుండా తెల్లబర్లీ పొగాకును అగ్రిమెంట్ ప్రకారం సాగు చేసుకోవాలని సూచించారు. పొగాకు పంటకు బదులు ఇతర పంటలు వేసుకోవాలన్నారు. యూరియాను అధిక ధరలకు విక్రయిస్తే శాఖాపర చర్యలు తీసుకుంటామని ఏఓ హెచ్చరించారు. వ్యవసాయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నల్లబర్లీ పొగాకు సాగు నిషేధం


కందిపంటను పరిశీలిస్తున్న ఏఓ సంపత్‌కుమార్

కురిచేడు: నల్లబర్లీ పొగాకు సాగు నిషేధించారని, రైతులు ప్రత్యామ్నాయ పంటలుగా మినుము, మొక్కజొన్న పంటలు సాగు చేయాలని వ్యవసాయాధికారి బి.సంపత్‌కుమార్ అన్నారు. మండలంలోని పడమర గంగవరం, పొట్లపాడు గ్రామాల్లో సాగు చేసిన కంది, పొగాకు పంటలను పరిశీలించారు. కంది సాగు చేసే రైతులు 35 నుంచి 40 రోజుల్లో నీటిలో కరిగే గంధకం మూడు గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. రైతులంతా తప్పనిసరిగా పంటల బీమా చేయించుకోవాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంట నష్టపోతే నష్టపరిహారం అందుతుందన్నారు. రైతులు అవసరానికి మించి యూరియా వాడవద్దని సూచించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు చంద్రకాంత్, మల్లికార్జున్ నాయక్, రైతులు పాల్గొన్నారు.

ప్రజలకు నాణ్యమైన సేవలు అందజేయాలి


సచివాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీడీవో మరియదాసు

పుల్లలచెరువు: సచివాలయంలో పనిచేస్తున్న సిబ్బంది ప్రజలకు జవాబుదారీగా ఉంటూ నాణ్యమైన సేవలు అందజేయాలని ఎంపీడీవో మరియదాసు పేర్కొన్నారు. మండలంలోని ముటుకుల సచివాలయాలని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, హాజరు పట్టీలను పరిశీలించి మాట్లాడుతూ సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా సమయపాలన పాటించాలని, సచివాలయానికి వచ్చే ప్రజల పట్ల అగౌరవంగా మాట్లాడరాదని అన్నారు. అనంతరం గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఆయన వెంట కార్యదర్శి ఉదయకిరణ్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించండి


త్రిపురాంతకం హైవేపై ద్విచక్ర వాహనదారులకు సూచలిస్తున్న ఎస్‌ఐ

త్రిపురాంతకం: రోడ్డు ప్రమాదాలను అధిగమించేందుకు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ఎస్‌ఐ శివబసవరాజు తెలిపారు. త్రిపురాంతకం నేషనల్ హైవేపై ద్విచక్ర వాహనదారులకు తగిన సూచనలు ఇచ్చారు. హైవేపై ప్రయాణించే సమయంలో ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. త్రిబుల్ రైడింగ్ చేయరాదని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని హెచ్చరించారు. ఈయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

చదువు చెప్పే వారేరీ..!

- మండలంలో మొత్తం ఉపాధ్యాయ పోస్టులు 209
- ప్రస్తుతం పనిచేస్తున్న వారు 71 మంది
- ఉపాధ్యాయుల ఖాళీలు 138
- చాలా పాఠశాలలకు ఒక్క ఉపాధ్యాయుడే దిక్కు
- ఈ డీఎస్సీ కౌన్సెలింగ్‌లోనైనా పోస్టులు భర్తీ చేస్తారని విద్యార్థుల తల్లిదండ్రుల ఎదురుచూపులు


ఐదు తరగతుల విద్యార్థులకు బోధిస్తున్న ఒకే ఉపాధ్యాయుడు

పుల్లలచెరువు: జిల్లాలో వెనుకబడిన మండలాల్లో ఒకటైన పుల్లలచెరువులోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. ఈ ప్రాంతంలో వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే ఎక్కువగా చదివిస్తుంటారు. కానీ రెండేళ్లుగా విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడంతో చదువులు సక్రమంగా సాగడం లేదు. దీంతో గత్యంతరం లేక తల్లిదండ్రులు ఆర్థికంగా భారమైనా పిల్లల భవిష్యత్తు కోసం ప్రైవేటు పాఠశాలలకు పంపుతున్నారు. పుల్లలచెరువు మండలంలో ఎలిమెంటరీ, జెడ్పీ పాఠశాలలు మొత్తం 61 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వాటిల్లో 209 మంది ఉపాధ్యాయులు పనిచేయాల్సి ఉండగా ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయులు 71 మంది మాత్రమే. మండలంలోని వివిధ పాఠశాలల్లో 138 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలు ఉన్నాయి. కొన్ని పాఠశాలల్లో 1 నుంచి 5 వరకు ఒకే ఉపాధ్యాయుడు, ఒకే తరగతి గదిలో పాఠాలను బోధించాల్సి వస్తోంది. ఇటీవల కాలంలో చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయులు బదిలీ అయినా కొంత మంది రిలీవ్ కాకుండా పాత పాఠశాలల్లో కొనసాగుతున్నారు. కొత్త ఉపాధ్యాయ నియామకాలు జరిగితే, బదిలీ అయి ఉన్న వారు మరి కొందరు వెళ్లే అవకాశం ఉందని ఉపాధ్యాయులు అంటున్నారు.

ప్రకటించిన పోస్టుల్లో 22 శాతం పుల్లలచెరువుకే అవసరం:

జిల్లాలో 611 మంది ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికయ్యారని అధికారులు చెబుతున్నారు. పుల్లలచెరువు మండలానికే 138 మంది ఉపాధ్యాయులు అవసరం కాగా ఎంతవరకు ఉపాధ్యాయులు పుల్లలచెరువు మండలానికి వస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. వెబ్ కౌన్సెలింగ్ ద్వారా నమోదు చేసుకోవాలంటే దగ్గరలో ఉన్న వారు తప్ప పుల్లలచెరువు మండలానికి పూర్తి స్థాయిలో వచ్చే అవకాశం ఉండదని ఉపాధ్యాయులు చర్చించుకుంటున్నారు. అధికారులు చర్యలు తీసుకుంటే తప్ప పుల్లలచెరువు మండలానికి పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు వచ్చే అవకాశం లేదు. విద్యార్థులకు న్యాయం జరగాలంటే అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

మండలానికి ఉపాధ్యాయులను కేటాయించాలి



పుల్లలచెరువు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాలు విద్యార్థుల చదువు కోసం నానా ఇబ్బందులు పడుతున్నారు. ఉపాధ్యాయులు లేకపోవడంతో చేసేది లేక అప్పులు చేసి ప్రైవేటు పాఠశాలలకు పంపుతున్నారు. ఉపాధ్యాయులు ఉంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే ఈ ప్రాంతంలో విద్యార్థులు ఎక్కువగా ఉంటారు. అధికారులు చర్యలు తీసుకొని పుల్లలచెరువు మండలానికి పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులను కేటాయించాలి.

– కె.జానకిరఘు, రైతు సంఘం నాయకుడు, పుల్లలచెరువు.

అధికారులు స్పందించాలి



పుల్లలచెరువులో ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ కావాలంటే జిల్లా అధికారులు చర్యలు చేపట్టాలి. మండలంలో మొత్తం 138 మంది ఉపాధ్యాయులు వివిధ పాఠశాలల్లో అవసరం కాగా అంతమంది ఉపాధ్యాయులు వచ్చేలా జిల్లా అధికారులు చొరవ చూపాలి. లేకపోతే ఈ ప్రాంతంలో బడి మానేసిన విద్యార్థులు ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. చదువుకోవడానికి పట్టణాల్లో ఎన్నో అవకాశాలు ఉన్నాయి. గ్రామాల్లో అవకాశాలు తక్కువ. ప్రభుత్వ పాఠశాలలపైనే ఎక్కువ మంది ఆధారపడి విద్యను అభ్యసిస్తుంటారు. అధికారులు చొరవ చూపి ఉపాధ్యాయులు వచ్చేలా చూడాలి.

– జి.గురునాథం, మాజీ విద్యాకమిటీ చైర్మన్, పుల్లలచెరువు జెడ్పీ పాఠశాల

నేటి నుంచి మండల స్థాయి స్కూల్ గేమ్స్

- క్రీడా మైదానాన్ని పరిశీలించిన ఎంఈఓ, ప్రధానోపాధ్యాయులు

పెద్దదోర్నాల: నేటి నుంచి మండల కేంద్రంలో జరిగే మండల స్థాయి స్కూల్ గేమ్స్ నిర్వహణకు సంబంధించి అధికారులు మంగళవారం పెద్దదోర్నాలలో సమావేశం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ సమావేశంలో ఎంఈఓ మస్తాన్ నాయక్‌తో పాటు పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్‌లు హాజరయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జరిగే ఈ మండల స్థాయి పోటీలు బుధ, గురువారాలు పెద్దదోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తారని ఎంఈఓ మస్తాన్‌నాయక్ పేర్కొన్నారు. అండర్ 14, అండర్ 17 క్యాటగిరీల్లో బాల బాలికలకు ఈ పోటీలు నిర్వహిస్తారని ఎంఈఓ తెలిపారు. ఈ పోటీల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, యోగా, చదరంగంలతో పాటు, 100, 200, 400, 800 మీటర్ల పరుగు పందెం, 80 మీటర్ల హార్డిల్స్, హై జంప్, లాంగ్ జంప్, షాట్‌పుట్, డిస్కస్ త్రో, రిలే లాంటి అథ్లెటిక్ ఈవెంట్స్ ఉంటాయని ఆయన తెలిపారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన క్రీడాకారులను డివిజన్ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక చేస్తారన్నారు. సమావేశంలో ఎంఈఓతో పాటు శ్యామ్ ప్రధానోపాధ్యాయులు ప్రసన్నతాంజలి, మహంత్‌నాయక్, ఝాన్సీలక్ష్మీబాయి, కోటేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు, పి.రామానాయక్, హెచ్.రామబానాయక్, సిద్ధు, తులసీనాయక్, బాబు, అపర్ణ, సరస్వతీబాయి తదితరులు పాల్గొని క్రీడా మైదానాన్ని పరిశీలించారు.


మాట్లాడుతున్న ఎంఈఓ 1 ప్రగడ శ్రీనివాసులు

రేపటి నుంచి స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడలు

పెద్దారవీడు: మండలంలోని ఏనుగులదిన్నెపాడు గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 18, 19వ తేదీల్లో మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ–1 ప్రగడ శ్రీనివాసులు తెలిపారు. స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో మంగళవారం వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ మండల పరిధిలో 11 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు క్రీడల్లో పాల్గొంటారని, రెండు విభాగాల్లో స్పోర్ట్స్, గేమ్స్ పేరిట ఆటల పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులను ఆటలు ఆడేందుకు ప్రధానోపాధ్యాయులు ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానిక ప్రధానోపాధ్యాయులు షేక్ అహమ్మద్, మండల కో ఆర్డినేటర్ పీడీ చంద్రయ్య, స్థానికవరం, గొబ్బూరు, బద్వీడు చెర్లోపల్లి పాఠశాలల పీడీలు శ్రీనివాసులు, మంత్రునాయక్, దేవిబాయి పాల్గొన్నారు.


క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ, ప్రధానోపాధ్యాయులు

18 నుంచి పాఠశాలల క్రీడా పోటీలు

యర్రగొండపాలెం: పాఠశాలల క్రీడా పోటీలు ఈ నెల 18, 19వ తేదీలలో నిర్వహించనున్నట్లు ఎంఈవో పి.ఆంజనేయులు మంగళవారం తెలిపారు. మండల స్థాయిలో బోయలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ పోటీలు జరుగుతాయని, వయస్సు ఆధారంగా 4 విభాగాల్లో బాలురు, బాలికలకు వేర్వేరుగా ఉంటాయని, ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన వారై ఉండాలని, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ధ్రువీకరణ చేయాలని ఆయన తెలిపారు. కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, వాలీబాల్, చెస్, స్పోర్ట్స్ ఈవెంట్‌లలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకొని విద్యార్థులు క్రీడల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని ఆయన ఆదేశించారు.

పెద్దవరాన్ని జల్లెడ పట్టిన వైద్య సిబ్బంది


డ్రైనేజీల్లో ఎబేట్ పిచికారీ చేస్తున్న వైద్యాధికారి సుష్మితరెడ్డి


వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారి సుశ్మితారెడ్డి

సాక్షి ఎఫెక్ట్..

కురిచేడు: మండలంలోని పెద్దవరంలోని ఇంటింటిని వైద్యసిబ్బంది మంగళవారం పరిశీలించి జ్వరాల సర్వే చేశారు. 'మంచంపట్టిన పెద్దవరం' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన వైద్యాధికారి ఊ సుష్మితరెడ్డి తన సిబ్బందితో వెళ్లి వైద్యశిబిరం నిర్వహించారు. ఇంటింటి సర్వే చేసి జ్వరపీడితులను గుర్తించి వైద్యచికిత్సలు అందించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. డ్రైనేజీలో ఎబేట్ పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సుష్మితరెడ్డి మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమల తెరలు వాడాలని, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని, నీటిని కాచి చల్లార్చి తాగాలని సూచించారు. సర్పంచ్ మారెళ్ల నరసమ్మతో మాట్లాడి గ్రామంలోని వీధుల్లో బ్లీచింగ్ చల్లించాలని, బావుల్లో క్లోరినేషన్ చేయించాలని సూచించారు. గ్రామంలో ఎవరికి జ్వరం వచ్చినట్లు అనుమానం వచ్చినా ఆరోగ్య ఉపకేంద్రానికి రావాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా అధికారి బసవారెడ్డి, నాయకులు మారెళ్ల రామాంజి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలను ప్రోత్సహించాలి


మాట్లాడుతున్న ఎంఈఓలు సుబ్బయ్య, సుధాకర్‌రావు

తాళ్లూరు: క్రీడలను ప్రోత్సహించాలని, తద్వారా క్రీడా రంగంలో ఉన్నత స్థాయికి ఎదుగుతారని ఎంఈఓలు సుబ్బయ్య, సుధాకర్‌రావు అన్నారు. స్థానిక ఎమ్మార్సీలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల నిర్వహణపై మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 19న తూర్పుగంగవరం హైస్కూల్‌లో నిర్వహిస్తున్న అండర్–14, అండర్–17 క్రీడలు ప్రధానోపాధ్యాయుడు వైఎస్సార్ కె.ప్రసాద్ అధ్యక్షతన జరుగుతాయన్నారు. ఇందులో ప్రతిభ చాటిన క్రీడాకారులను మండల స్థాయికి ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు.

సమస్యలు పరిష్కరించని సమావేశాలెందుకు..?

దొనకొండ: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను చర్చించి పరిష్కరించేందుకు ప్రతి మూడు నెలలకు మండల సర్వసభ్య సమావేశాలు నిర్వహిస్తారు. అయితే ఈ సమావేశాలు మొక్కుబడిగా సాగుతున్నాయని సభ్యులు వాపోతున్నారు. సమావేశం నిర్వహించి మూడు నెలలు గడుస్తున్నా ఏ ఒక్క సమస్య పరిష్కరించలేదంటున్నారు. దొనకొండ నుంచి వయా ఆరవల్లిపాడు, వద్దిపాడు, సంగాపురం, కలివెలపల్లి మీదుగా మార్కాపురం బస్సు సౌకర్యం కల్పించాలని గత సమావేశంలో ఆర్టీసీ అధికారులను వద్దిపాడు సర్పంచ్ నూనె సరోజా వెంకటరెడ్డి కోరారు. దొనకొండ–గజ్జలకొండకు గతంలో 20 ఏళ్ల క్రితం వేసిన పూర్తిగా మరమ్మతులకు గురైందని, ద్విచక్ర వా:నాలు, ఆటోలు, పాదాచారులు నడవడానికి ఇబ్బందిగా ఉందని, రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ఇండ్లచెరువు ఎంపీటీసీ పాతకోట చిన్న కోటమ్మ కాశిరెడ్డి కోరారు. దొనకొండకు సాగర్ నీరు సక్రమంగా సరఫరా కావడం లేదని, దీంతో అన్ని వీధుల్లోని ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారని సమావేశంలో ప్రజాప్రతినిధులు అధికారులను నిలదీశారు. అయినా ఒక్క సమస్యను పరిష్కరించలేదు.

నేడు మండల సమావేశం

మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళీ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్‌ఎండి దావూద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరు కావాలని, సంబంధిత అధికారులు సమగ్ర సమాచారంతో హాజరు కావాలని ఆయన కోరారు.

శిథిలావస్థకు చేరిన బాదాపురం చప్టా


చిల్లచెట్లతో నిండి శిథిలావస్థకు చేరిన చప్టా

దొనకొండ: మండలంలోని బాదాపురం, ఎస్సీ కాలనీవాసులు నిత్యం ప్రయాణం సాగించే చప్టా శిథిలావస్థకు చేరింది. ఈ చప్టా నుంచే గ్రామస్తులు రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో బాదాపురం ప్రజలు ఎస్సీ కాలనీకి వచ్చేందుకు, ఎస్సీ కాలనీవాసులు బాదాపురం వెళ్లేందానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో నాసిరకంగా చప్టా నిర్మించటంతో నేడు పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దీంతో ఆ ప్రాంతం అంతా చిల్లచెట్లతో నిండిపోయింది. అంతేకాకుండా నిత్యం వాహనచోదకులు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు వెళ్లేందుకు ఇబ్బందికరంగా ఉంటుంది. నిత్యం రైతులు ట్రాక్టర్ల ద్వారా పొలాలకు వెళ్లాల్సి వస్తుంది. ప్రత్యామ్నాయ మార్గం లేకపోవడంతో పక్కనే వాగులో నుంచి ప్రయాణం సాగిస్తున్నారు. వర్షం కురిసిన సమయంలో వాగులో నీరు ప్రవహిస్తుండటంతో ఆ సమయంలో రాకపోకలు నిలిచిపోతున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదని బాదాపురం గ్రామస్తులు, ఎస్సీ కాలనీ వాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన చప్టా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని వారు కోరుతున్నారు.

నైపుణ్యం సాధిస్తేనే భవిష్యత్‌లో ఉద్యోగాలు


మాట్లాడుతున్న హైమావతి

దర్శి: డిగ్రీస్థాయిలో నైపుణ్యాలు సాధిస్తేనే భవిష్యత్‌లో ఉద్యోగాల అవకాశాలు ఉంటాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల కెరియర్ గైడెన్స్ సెల్ డాక్టర్ కె.హైమావతి సూచించారు. స్థానిక కళాశాలలో మంగళవారం విద్యార్థులకు నైపుణ్యాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హైమావతి మాట్లాడుతూ నైపుణ్యాలు సాధించే విధానం గురించి వివరించారు. విద్యార్థులకు మరింత సమాచారం కోసం వారు నడుపుతున్న కెరియర్ మైండ్స్ అనే ఒక పోర్టల్ గురించి పిల్లలకు వివరించారు. సీపీడీసీ మెంబర్ జీవీ రత్నం, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ప్రభుదాస్, ఆంగ్ల అధ్యాపకులు డాక్టర్ ఏ నగేష్, తెలుగు అధ్యాపకులు డాక్టర్ జి.వేణు, ఫిజిక్స్ అధ్యాపకులు డాక్టర్ కె.నరేష్, కెమిస్ట్రీ ఆధ్యాపకులు ఎల్. రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

పంటలకు యూరియా ఎక్కువగా వాడొద్దు

- ఏడీ వెంకటరవణ


కవలకుంట్లలో రైతులకు సూచనలు ఇస్తున్న ఏడీ వెంకటరవణ

పుల్లలచెరువు: రైతులు సాగు చేసిన పంటకు యూరియాను ఎక్కువగా వాడితే క్యాన్సర్ వంటి ప్రమాదకరమైన వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, గ్రామాల్లో పంటలను సాగు చేసిన ప్రతి రైతు ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని యర్రగొండపాలెం అగ్రికల్చర్ ఏడీ ఈ.వెంకటరవణ అన్నారు. మంగళవారం మండలంలోని పిడికిటివానిపల్లి, కవలకుంట్ల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్ర స్థాయిలో పత్తి, వరి పంటలను పరిశీలించి రైతులకు తగు సూచనలు చేసినట్లు ఏడీ తెలిపారు. పత్తి పంటలో పురుగు ఉధృతి తగ్గించాలంటే తప్పనిసరిగా ఎకరానికి 10 లింగాకర్షక బుట్టలు వాడుకోవాలన్నారు. రసాయన ఎరువులను తగ్గించుకుని సేంద్రియ ఎరువుల వాడకంపై రైతులు దృష్టిపెట్టాలన్నారు. ఎక్కువ యూరియా వాడడంతో భూసారం కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏవో గోపికృష్ణ, సిబ్బంది కోటేశ్వరనాయక్, రాంబాబు లతోపాటు రైతులు పాల్గొన్నారు.

పంటలు నమోదు చేసుకోవాలి


త్రిపురాంతకం మండలం వెల్లంపల్లిలో వరి పంట పరిశీలించి సూచనలిస్తున్న ఏఓ

త్రిపురాంతకం: రైతులు పండించే పంటలను నమోదు చేసుకోవడం వలన ప్రకృతి వైపరీత్యాలతో వచ్చే నష్టాలను అధిగమించేందుకు ఇన్‌పుట్ సబ్సిడీలు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి సంఘమేశ్వరరెడ్డి పేర్కొన్నారు. త్రిపురాంతకం మండలం వెల్లంపల్లి, విశ్వనాథపురం గ్రామాలలో పంటలను పరిశీలించి రైతులకు అవసరమైన సలహాలు సూచనలు అందించారు. రైతులు తాము పండిస్తున్న పంటలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. తెగుళ్లు, చీడపీడల పట్ల అప్రమత్తంగా ఉండాలని సంఘమేశ్వరరెడ్డి సూచించారు. ఈయన వెంట వ్యవసాయ సహాయకులు జాషువ, మాధవి, వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

మానవతా సంస్థ ఆధ్వర్యంలో వృద్ధ శవానికి అంత్యక్రియలు


మృతదేహానికి నివాళులర్పిస్తున్న మానవత సభ్యులు

దర్శి: స్థానిక శివరాజ్ నగర్ సచివాలయం సమీపంలో వృద్ధుడు వల్లెపు వెంకటేశ్వర్లు అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. వెంకటేశ్వర్లు భిక్షాటన చేసుకొని జీవిస్తున్నాడు. విషయం తెలుసుకున్న మానవతా సంస్థ ప్రతినిధులు వృద్ధునికి అంత్యక్రియలు చేశారు. మానవత సంస్థకు చెందిన శాంతిరథంలో తప్పెట్లతో వీధుల్లో ఊరేగించి అంత్యక్రియలు నిర్వహించారు. సంస్థ చైర్మన్ దేవతి వరప్రసాదు రూ.3 వేలు తన సొంత నిధులు కేటాయించారు. కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవాసంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి కపురం శ్రీనివాసరెడ్డి, కన్వీనర్ ధనిరెడ్డి వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి గొర్రెపాటి వేణు, అత్యవసర విభాగం డైరెక్టర్ రోశారావు, స్థానికులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అక్షర ఆంధ్రలో భాగస్వాములు కావాలి


అక్షరాంధ్ర పుస్తకాలు పంపిణీ చేస్తున్న అధికారులు

కురిచేడు: సంపూర్ణ అక్షరాస్యత సాధనే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉల్లాస్ అక్షర ఆంధ్ర కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని ఎంపీడీఓ కేజీఎస్ రాజు అన్నారు. వలంటరీ టీచర్ల మండలస్థాయి శిక్షణ కార్యక్రమం మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో రెండో విడతలో 3,045 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చే లక్ష్యంతో ఆవులమంద, కల్లూరు, పడమర నాయుడుపాలెం సచివాలయాల కార్యక్రమం నిర్వహించేలా చర్యలు చేపట్టినట్లు వయోజన విద్య పర్యవేక్షకుడు వై. చౌడిరెడ్డి వివరించారు. శిక్షణకు హాజరైన స్వచ్ఛంద ఉపాధ్యాయులకు వయోజన విద్యశాఖ ద్వారా సరఫరా చేసిన అక్షరాంధ్ర పాఠ్యపుస్తకాలు, వర్ బుక్‌లు పంపిణీ చేశారు. ఏపీఎం సైమన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ–2 సుబ్బారావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత, ఏపీఓ దేవయ్య, సీసీలు పాల్గొన్నారు.

పని ప్రదేశాల్లో ప్రథమ చికిత్స కిట్లు తప్పనిసరి

- డ్వామా పీడీ జోసఫ్ కుమార్


సిబ్బందిని విచారిస్తున్న ఉపాధి హామీ పీడీ జోసఫ్ కుమార్

పెద్దారవీడు: కూలీలు పని చేసే ప్రదేశాల్లో ప్రథమ చికిత్స కిట్లు తప్పనిసరిగా ఉంచాలని డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో 2024–25 సంవత్సరం సామాజిక తనిఖీ ప్రజావేదిక ఎంపీడీఓ జాన్‌సుందరం అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద 19 పంచాయతీల్లో 637 పనులకు రూ.19.53 కోట్లు ఖర్చు పెట్టారు. అందులో పంచాయతీరాజ్ శాఖ ద్వారా 53 పనులకు కూలీలకు రూ.10,966, మెటీరియల్‌కు రూ.4,00,73,895, ఎస్‌పిఏ ద్వారా మెటీరియల్‌కు రూ.6,63,819, అటవీ శాఖ పనులకు కూలీలకు రూ.66,894, మెటీరియల్‌కు రూ.1,67,083 ఖర్చు చేసినట్లు సామాజిక బృందం వెల్లడించారు. ఉపాధి హామీ పనుల్లో అధికారులు, సిబ్బంది చేసిన అవినీతిని బట్టబయలు చేసేందుకు గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందం సభ్యులు విచారణ జరిపారు. కూలీల మస్టర్లలో సంతకాలు, వేలిముద్రలు ఒకే విధంగా వేసినట్లు, గ్రామంలో లేకుండా ఇతర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసుకున్న వారికి మస్టర్లలో హాజరు వేసినట్లు గుర్తించారు. పీడీ మాట్లాడుతూ మస్టర్ల కాగితాల్లో కూలీలచే సంతకాలు, వేలిముద్రలు వేయించాలని, మేట్లకు మస్టర్ల కాగితాలు ఇవ్వకుండా ఫీల్డ్ అసిస్టెంట్లు మాత్రమే హాజరైనట్లు కూలీలచే సంతకాలు, వేలిముద్రలు వేయించాలని చెప్పారు. మరణించిన, గ్రామంలో లేని వారి పేర్లు వెంటనే తొలగించాలని ఎంపీడీఓను ఆదేశించారు. రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా పెట్టుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఉపాధి పనులపై సామాజిక తనిఖీలో భాగంగా గ్రామ సభలను తూతూ మంత్రంగా నిర్వహించారని ప్రజలు ఆరోపిస్తున్నారు. సమావేశానికి ప్రజలు మాత్రం హాజరు కాలేదు. సమావేశానికి గతంలో పని చేసిన టీఏలు, ఎఫ్ఏలు, ప్రస్తుతం టీఏలు, ఎఫ్ఏలు హాజరైయ్యారు. కార్యక్రమంలో ఏపీడీ తిరుమలదేవి, ఏపీఓ సాంబశివయ్య, సూజాత, ఎస్ఆర్పీ ఆవులయ్య, ఈసీ మంత్రునాయక్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ అసరేటర్లు పాల్గొన్నారు.